కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం



మేడ్చల్ : పట్టణంలోని సత్యనగర్ కాలనీ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.హరి ఎన్నికయ్యాడు. కాలనీవాసులు అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సమావేశమై ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దయాన్, కార్యదర్శిగా ఖాజారఫీద్దీన్ అహ్మద్ తదితరులను ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్



మాట్లాడుతున్న సంపత్‌యాదవ్

కీసర : తెలంగాణలో కంపెనీలు వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని బీజేపీ నేత సంపత్‌కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో కొత్త కంపెనీలు ఎక్కడ ఏర్పాటు చేశారని ఆయన ప్రశ్నించారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఆయన మాట్లాడుతూ.. విదేశీ కంపెనీలు కొత్తగా రాష్ట్రంలో ఏ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టి ఎంత మందికి ఉపాధి కల్పించారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 10 ఏళ్ల పాటు విదేశీ పర్యటనలు చేసి లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొస్తున్నామని ప్రజలను మోసం చేశారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలకుల తీరు బీఆర్ఎస్ పాలకుల తరహాలోనే ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మేడ్చల్ : పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వ్యక్తికి సీఎం సహాయ నిధి నుంచి చెక్కు మంజూరైంది. కాగా చెక్కును కౌన్సిలర్ ఉమానాగరాజు అతడి కుటుంబసభ్యులకు అందజేశారు. వార్డుకు చెందిన మల్లేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు మంజూరు కావడంతో ఆయన కుమారుడు నవీన్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు.

గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం : అన్నోజిగూడలో దాతల సహకారంతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనానికి చైర్మన్ కొండల్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠకుల సౌకర్యార్థం గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. పుస్తక పఠనంపై పెద్దలతో పాటు పిల్లలు ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ సాయిరెడ్డి, నాయకులు శేఖర్‌ముదిరాజ్, చిన్న నర్సింహులుగౌడ్, కొంతం శంకర్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు



ఘట్‌కేసర్ : ఎదులాబాద్ గోదా సమేత రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈనెల 4న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు సమీప ప్రాంతాల భక్తులతో పాటు నగరం నుంచి వేలాదిగా హాజరయ్యారు. ముగింపు వేడుకల్లో ఆలయంలో నిత్యనిధి, స్వామివారి ఘటాభిషేకం, మహదాశీర్వచనం తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్‌కు సైకిల్ అందజేత



సీఐ నాగరాజుకు సైకిల్‌ను అందజేసిన బాలుడు

జవహర్‌నగర్ : రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు పోలీసులు సైకిళ్లపై వెళ్తూ.. సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. ఈ మేరకు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు సైకిళ్లపై తిరుగుతున్న విషయం గమనించిన యాప్రాల్ శాలివాహన ఎన్‌క్లేవ్ నివసించే భాస్కరన్ కుమారుడు నిఖిల్ తన ఇంట్లో ఉన్న సైకిల్‌ను ఆదివారం జవహర్‌నగర్ సీఐ నాగరాజుకు అందజేశారు. అనంతరం బాలుడు నిఖిల్‌ను స్థానికులు ప్రశంసించారు. ఎస్సై రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలను అనుసరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్ : డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఆలోచన విధానాలను నేటి యువత అనుసరించాలని, వైద్యుడు శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంటరానితనం, కుల మత, లింగ వివక్ష లేకుండా ప్రజలందరూ సమానంగా జీవించాలని అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. దాసు, శ్రీనివాస్‌రావు, సత్యం, నరేందర్, రాజేష్, అంజయ్య, గణేష్‌గౌడ్ కృష్ణంరాజు, విష్ణు, భరత్, ప్రవీణ్, కార్తీక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి చర్యలు



మంత్రి సీతక్క ప్రకటనతో మహిళా,శిశు సంక్షేమశాఖ కసరత్తు

- టీచర్, హెల్పర్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు
- గ్రేటర్ సహా శివారు జిల్లాలలో 331 ఖాళీలు
- టీచర్లు, ఆయాల కొరతతో గర్భిణీలు, చిన్నారులకు తప్పని వెతలు

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా టీచర్, ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. అంగన్‌వాడీల్లో ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులతో గర్భిణులు, చిన్నారులకు వెతలే మిగులుతున్నాయి. ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్స్ (ఆయా) పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని సంబంధిత మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఇటీవల చేసిన ప్రకటనతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

సాక్షి, సిటీబ్యూరో

● అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టం చేయటంతో పాటు గర్భిణీలు, చిన్నారుల వెతలు తీర్చుతామని ప్రభుత్వం పేర్కొనటంతో పాటు.. కేంద్రాలకు పంపిణీ చేస్తున్న గుడ్లు ఇతర పౌష్టికాహారంపై సంబంధిత అధికార యంత్రాంగం సీరియస్‌గా వ్యవహరిస్తోంది.

పరిమాణం తగ్గితే వెనక్కే..

తక్కువ పరిమాణం ఉన్న గుడ్లు పంపిణీ చేస్తే వాటిని అధికారులు వెంటనే వెనక్కి పంపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ (ఆయా) పోస్టుల కోసం గతంలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వాటి పరిశీలన కూడా పూర్తైంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వం ఆదేశాల కోసం ఎదురు చూస్తోంది.

విధుల నిర్వహణలో వీరే కీలకం..

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణతో పాటు గర్భిణీలు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి విధులు నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పాత్ర కీలకంగా ఉంటుంది.

1 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు ..

ఒకటి నుంచి ఆర్లేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకొస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వటం, అవి తిన్న తర్వాత వండిన పౌష్టికాహారం పెట్టడం వంటి విధులను వారు నిర్వహిస్తారు. పసిపిల్లలు కావడంతో వారి వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కొందరు పిల్లలు రెండుకు వెళ్తే కూడా వారిని కడిగి తుడిచి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలకు చెమటలు పట్టి ఏడుస్తూ దిక్కులు చూస్తున్నప్పుడు వారిని సముదాయించాల్సిన పనులు కూడా హెల్పర్లు నిర్వహిస్తారు.

జిల్లా	అంగన్వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య	ఖాళీ పోస్టులు
హైదరాబాద్	914	1,19,800	167
మేడ్చల్	793	95,017	124
రంగారెడ్డి	1600	1,78,797	40
మొత్తం	3,306	3,43,694	331

కేంద్రాల్లో ఖాళీలు ఇలా..

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం పోస్టులు 167 ఖాళీగా ఉండగా.. టీచర్ పోస్టులు 42, హెల్పర్లు 125గా ఉన్నాయి.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 124 పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇందులో 21 టీచర్లు, 103 హెల్పర్ పోస్టులు ఉన్నాయి.
- రంగారెడ్డి జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇందులో టీచర్ పోస్టులు 8 , హెల్పర్ పోస్టులు 32 ఖాళీలు ఏర్పడ్డాయి.
- గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ పూజలు



మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, ఆలయ శాశ్వత చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్



పూజల్లో పాల్గొన్న సాయిదత్త పీఠాధిపతి స్వామి శ్రీరామానంద ప్రభూజీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలోని శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి, షిర్డిసాయిబాబా దేవస్థానం, అభయాంజనేయస్వామి, పోచమ్మ దేవాలయం షోడశదశ (16వ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు ఆదివారంతో ముగిశాయి. వార్షికోత్సవ పూజల్లో భాగంగా ఆదివారం దేవాలయంలో మూలమంత్ర హోమం, బలిప్రదానం, మహాపూర్ణాహుతి, తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం, సాయిధామం- సాయిదత్తపీఠాధిపతి స్వామి శ్రీరామానంద ప్రభూజీ భక్తులకు ప్రవచనం చేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, ఆలయ శాశ్వత చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, కౌన్సిలర్లు లావణ్య, బిజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా భాస్కర్‌యాదవ్

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా గిర్మాపూర్‌కు చెందిన సీనియర్ నాయకుడు భాస్కర్‌యాదవ్ నియమితులయ్యారు. గతంలో పనిచేసిన అధ్యక్షుడు పార్టీ మారడంతో బీఆర్ఎస్ జిల్లా అధిష్టానం భాస్కర్‌యాదవ్‌ను పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా నియమించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు ఆయనకు నియమాకపత్రాన్ని అందజేశారు.



ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



బాలాజీనగర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్ : పట్టణంలోని బాలాజీనగర్ మూడు గుడల అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిపించారు. ముఖ్యఅతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు ఆంజనేయులుముదిరాజ్, రాధాకృష్ణముదిరాజ్, ముత్యాలుయాదవ్, మశ్చేందర్‌రెడ్డి, నాగరాజుముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులుయాదవ్, వెంకటేశ్‌ముదిరాజ్, దేవేందర్‌ముదిరాజ్, సంజీవరెడ్డి, సురేష్, శ్రీశైలంముదిరాజ్, నాగభూషణంచారి, నర్సింగ్‌రావు, మల్లేష్‌యాదవ్, రవీందర్, దయాకర్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల్‌లోని జేకే ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలోని జిల్లాల నుంచి పెద్దఎత్తున హాజరై తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన పాడి గణపతిరెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నాయకులు నిర్మల్ల శ్రీధర్, సురేష్, ఐలయ్య, రమేష్, జాజుల శ్రీనివాస్‌గౌడ్ మహేష్, జనార్దన్, ప్రవీణ్, గర్రెపల్లి శ్రీనివాస్, ఉపేందర్, కిష్టయ్య, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి పంచామృతాభిషేకం



స్వామివారి దర్శనం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కీసర : కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామికి శ్రావణమాసోత్సవాల ప్రత్యేకపూజల్లో భాగంగా వేదపండితులు పంచామృతాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయం గర్భాలయంలోని స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాభిషేకం చేశారు. ఆదివారం కావడంతో స్వామివారి దర్శనం కోసం పెద్దఎత్తున భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈవో సుధాకర్‌రెడ్డి, అర్చకులు రవిశర్మ, బలరామ్‌శర్మ పాల్గొన్నారు.

కళాశాల స్వర్ణోత్సవాలు

ఉప్పల్ : ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల ఏర్పాటై 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ అరుణ్ ప్రకాశ్ తెలిపారు. డిసెంబర్ 7,8 తేదీల్లో నిర్వహించే స్వర్ణోత్సవాలకు పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా తీజ్ వేడుకలు

ఘట్‌కేసర్ : మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజార మహిళలు భక్తి శ్రద్ధలతో తీజ్ పర్వదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కౌన్సిలర్ సంగీత హాజరయ్యారు. పెళ్లికాని గిరిజన యువతులు తొమ్మిది రోజులుగా నవధాన్యాలకు నీరు పోసి పెంచిన వెదురు బుట్టను ఎత్తుకుని చేసిన నృత్యాలు అలరించాయి. డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, కుమార్ ముదిరాజ్, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్‌ముదిరాజ్, నాగరాజుముదిరాజ్, జంగారెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఎన్ఎఫ్‌సీనగర్‌లో తీజ్ వెదురు బుట్టలతో బంజారాలు

వైభవంగా బోనాల ఉత్సవాలు



శ్రీరంగవరంలో..

కీసర : నాగారం మున్సిపాలిటీ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరప్పస్వామి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. నేతాజీనగర్ దొడ్డి కొమురయ్య చౌరస్తా నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా బీరప్ప దేవాలయం వరకు వెళ్లి స్వామివారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారిమల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్రసురేష్, అనంతరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షులు జన్న యాదగిరి, ప్రధాన కార్యదర్శి నోముల, నాగరాజు, జోగురాములు, భాస్కర్, గణేష్, కొమరయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

నారపల్లిలో..

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండల్‌రెడ్డి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్లు సరిత, పోచమ్మ, సుధాలక్ష్మి, నాయకులు బుచ్చిరెడ్డి, రాఘవేందర్, లోకేష్‌రెడ్డి, రామారావు, పరశురాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు కాలనీల్లో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, సంగీతారాజశేఖర్, సతీష్‌కుమార్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఘనాపూర్‌లో..

ఘట్‌కేసర్ : ఘనాపూర్, అంకుషాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో బోనాల పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా అలంకరించిన బోనాలతో అమ్మవారి ఆలయం వరకు డప్పు చప్పుళ్లు, శివసత్తుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లారు.

మేడ్చల్ : మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మండలంలోని వివిధ గ్రామాల్లో వాడవాడలా బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం గుండ్లపోచంపల్లి, కిష్టాపూర్, గౌడవెల్లి తదితర గ్రామాల ఆలయాల్లో బోనాల పండగను చేశారు. మహిళలు సాంప్రదాయబద్ధంగా బోనాలను సిద్ధం చేసుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో పండగను శోభాయమానంగా జరిపారు.

శామీర్‌పేట్ : మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలో బోనాల పండుగను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. బోనాలతో గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. బోనాలతో ఆలయం చుట్టూ.. ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు.



బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే మల్లారెడ్డి



గుండ్లపోచంపల్లిలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో చైర్మన్ కొండల్‌రెడ్డి



నాగారంలో కురుమసంఘం ఆధ్వర్యంలో..